క్లుప్తంగా

ఆదివాసీలకు న్యాయం చేయండి



వాబ యోగి

సారవకోట: సమగ్ర శిక్ష ఉద్యోగాల భర్తీ విషయంలో ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి శనివారం ఓ ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కోరారు. ఈ నెల 23న సమగ్ర శిక్షలో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. దీంట్లో 507బోధన సిబ్బంది పోస్టుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం 6 శాతం పోస్టులు కేటాయించాల్సి ఉండగా.. ఆ విధంగా కేటాయించలేదన్నారు. బోధనేతర సిబ్బందికి సంబంధించి 97 పోస్టులలో ఆదివాసీలకు ఒక్క పోస్టు కూడా కేటాయించక పోవడం అన్యాయమన్నారు. విడుదల చేసిన నోటిఫికేషన్ స్థానంలో ఆదివాసీలకు న్యాయం చేస్తూ రీ నోటిఫికేషన్ ప్రకటించాలని కోరారు.

వసతి గృహాల పరిశీలన



తర్లి ఆశ్రమ పాఠశాలలో ఆహార వస్తువులను పరిశీలిస్తున్న జడ్జి రోషిణి

సారవకోట: మండలంలోని పలు వసతి గృహాలను పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి మానేం రోషిణి శనివారం పరిశీలించారు. సారవకోట సమీకృత వసతిగృహం, కేజీబీవీ, నవరబొంతు, తర్లి ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. తర్లి ఆశ్రమ పాఠశాలలో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటర్ ట్యాంక్ లీక్ అవుతుందని, పరిసరాల చుట్టూ పిచ్చి మొక్కలుంటున్నాయని, వర్షం పడితే నీరు నిల్వ ఉంటుందని ఆమె దృష్టికి విద్యార్థులు తీసుకువచ్చారు. సారవకోట సమీకృత వసతిగృహంలో వార్డెన్ అందుబాటులో లేనట్లు గుర్తించారు. కేజీబీవీ, నవరబొంతు ఆశ్రమ పాఠశాలలో సమస్యలు గుర్తించారు. ఆయా వసతిగృహాల్లో ఆహార పదార్థాల నాణ్యత, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ టి.వాసుదేవరావు మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. అమ్మవారి తిరువీధి, సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సన్యాసిరావు, నాయకులు పైల బాబ్జి, సైలాడ సతీష్, భాను, ఢిల్లీ, ప్రభాకరరావు, బుజ్జి, ప్రసాదరావు, దుర్గరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


క్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తం



పాస్టర్లను సత్కరిస్తున్న ఆరాధకులు

సరుబుజ్జిలి: ఏసుక్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తంగా విస్తరించాయని ఉత్తమ క్రైస్తవ సామాజిక సంస్కర్త, పాస్టర్ శామ్యూల్ అరుణ్‌కిరణ్ అన్నారు. మండల కేంద్రంలో గల పెంతుకోస్తు చర్చి వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువు ఆశీస్సులతో నిర్మించిన చర్చి నేటికి 12 సంవత్సరాలు పూర్తిచేసుకుందని, మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ పాస్టర్లను సత్కరించారు.

వినతుల స్వీకరణ



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న వీఆర్వోలు, సర్వేయర్లు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామంలో భూముల రీ సర్వేలో జరిగిన అక్రమాలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పలు ఆందోళనలపై స్థానిక తహసీల్దార్ పాపారావు స్పందించారు. మండలంలోని వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లను నాలుగు బృందాలుగా (24 మందితో) ఏర్పాటు చేశారు. రైతులు రాత పూర్వకంగా ఇచ్చిన వినతులను శనివారం స్వీకరించారు. తప్పులను త్వరలోనే సరిచేయడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

ఇదేం రాజకీయం స్వామీ

- చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు స్వామి
- తిరుపతి లడ్డూ ప్రసాదంపై కూటమి నాయకలు దుష్ప్రచారం తగదు
- వేంకటేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పలు ఆలయాల్లో పాప ప్రక్షాళన పూజలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు మహా పవిత్రంగా స్వీకరించే లడ్డూ అపవిత్రం అయిందంటూ తప్పుడు ప్రచారం చేసి, ఆ అపవాదును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేందుకు చేస్తున్న కుయుక్తులను వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చని కూటమి నాయకులు చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. అన్ని మండల కేంద్రాల్లోనూ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: బజారు వీధిలోని వేంకటేశ్వరాలయంలో పూజలు అనంతరం మాట్లాడుతున్న మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్



బూర్జ: ఉమాసోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: వేంకటేశ్వరస్వామి ఆలయం మెట్లు వద్ద పూజలు నిర్వహిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు



కొత్తూరు: నేరడిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు



ఆమదాలవలస: పట్టణంలోని వేంకటేశ్వస్వామి ఆలయ ఆవరణలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



ఎల్.ఎన్.పేట: జగన్నాథస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: అల్లాడలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయంలో దీపారాధన చేస్తున్న రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: రొట్టవలసలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలాకి: కిల్లిబుచ్చెన్నపేట వేంకటేశ్వరాలయం వద్ద పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: వేంకటేశ్వర స్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వంద రోజుల్లో చేసింది శూన్యం

కొత్తూరు: వంద రోజుల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నాయకులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, గోగులు వరప్రసాదరావు నాయుడు అన్నారు. కొత్తూరులో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఇది మంచి ప్రభుత్వం అని టీడీపీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు అనాలి తప్ప.. కూటమి నాయకులు కాదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమైనందున సీఎం చంద్రబాబు.. పవిత్రమైన తిరుమల లడ్డూను అపహాస్యం చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా తిరుపతి లడ్డూ పేరుతో రాజకీయం చేయడం దారుణమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కామక భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యుడు గండివలస రత్నకుమారి, లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు గండివలస ఆనందరావు, తిర్లంగి కృష్ణమోహన్, పంకజ దాస్ కుమార్, ఎస్.వెంకటరావు, పాపారావు, సాధుబాబు, పి.రామారావు నాయుడు, వై.గోవిందరావు, పతివాడ శివాజీ పాల్గొన్నారు .



మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ, వరప్రసాదరావు

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన నాయకులు

ఆమదాలవలస: భువనేశ్వర్ నుంచి శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస రైల్వే స్టేషన్) మీదుగా వెళ్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుని శనివారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అభిమానులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రైలు ఎక్కువ సమయం ఆగకపోవడంతో రైలు నుంచే అందరికీ వెంకయ్యనాయుడు అభివాదం చేశారు. శ్రీకాకుళం ప్రజలు ఎంతో అభిమానం చూపుతారని, తాను వస్తున్నానని తెలుసుకుని వచ్చి కలవడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



వెంకయ్యనాయుడిని కలిసిన రమేష్‌కుమార్, తదితరులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: ఎన్నికల ముందు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీకి సమయం లేదా అని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సమస్యల సేకరణలో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడితే రాష్ట్రంలోని 44 వేల పాఠశాలల సమస్యలు తెలుసుకున్న తరువాతతే ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుంటానని విద్యాశాఖ మంత్రి అనడం సరికాదన్నారు. 117 జీఓ రద్దు చేస్తామన్న ప్రభుత్వం ఇంతవరకు చేయకపోవడం సరికాదన్నారు. 12వ వేతన సంఘం చైర్మన్ రాజీనామా చేసిన తరువాత ఇంతవరకు ఎవరినీ నియమించలేదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి


ఆలయ హుండీ కానుకల లెక్కింపు రేపు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ ఆలయంలో ఈ నెల 30వ తేదీన హుండీ కానుకలను లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు లెక్కింపు ప్రారంభించనున్నారు. లెక్కింపునకు హాజరయ్యే భక్తులు డ్రస్ కోడ్ పాటించాలని కోరారు.

నకిలీ పింఛన్లు తొలగించాలి

సరుబుజ్జిలి: అడ్డదారుల్లో పొందిన పింఛన్లు రద్దుచేసి అర్హత కలిగినవారికి పింఛన్లు అందించాలని షళంత్రి ఎంపీటీసీ సభ్యుడు శివ్వాల సూర్యనారాయణ శనివారం ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్‌కు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆధార్ ట్యాంపరింగ్ చేసి వృద్ధాప్య పింఛన్లు, భర్తలు ఉండి వితంతు పింఛన్లు, నకిలీ సదరం ధృవపత్రాలతో మండలంలో అనేకమంది పింఛన్లు పొందుతున్నారన్నారు. ఇటువంటివి తక్షణమే తొలగించాలన్నారు.

మండల పరిషత్ ఏఓగా మల్లేశ్వరమ్మ



ఎల్.ఎన్.పేట: మండల పరిషత్ కార్యాయలం ఏఓ (అడ్మినిస్ట్రేటివ్ అధికారి)గా జి.మల్లేశ్వరమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ తెలిపారు. ఈమె జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా ఎల్.ఎన్.పేట ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏఓ జెడ్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో శాత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రణాళిక తయారు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శనివారం తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

మెళియాపుట్టి: గృహనిర్మాణాలు 2025 మార్చి నాటికి పూర్తిచేయకపోతే బిల్లులు నిలిచిపోతాయని మండల ప్రత్యేక అధికారి (పలాస ఏడీ) లింగాల మధుబాబు అన్నారు. శనివారం మన ఇల్లు–మన గౌరవం అనే కార్యక్రమంలో భాగంగా మెళియాపుట్టి మండల కేంద్రం, చాపర గృహనిర్మాణ సముదాయాల మధ్య లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కాలనీకి నీరు, కరెంట్, రహదారి సదుపాయాలు లేవని లబ్ధిదారులు తెలియజేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: జగనన్న లేఅవుట్లలో నిర్దేశించిన సమయంలో ఇళ్లు నిర్మించపోతే పట్టాలు రద్దు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. మండలంలోని యరగాం లేఅవుట్‌లో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు.

పాతపట్నం: జగనన్న లే అవుట్‌లో నిర్మాణం చేపడుతున్న ఇళ్లను త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలోని మినీ స్టేడియం వద్ద ప్రహరాజపాలెం లేఅవుట్‌లో మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమానికి హాజరయ్యారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హిరమండలం: మండలంలోని పలు సచివాలయాల్లో మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. హిరమండలంలోని మూడు సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని గృహనిర్మాణశాఖ ఏఈ రమేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. అధికారులు పాల్గొన్నారు.

పొందూరు: పేదవారికి ఇంటి స్థలం అందించడంతోపాటు సొంతిళ్లు నిర్మించడం ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరులోని జగనన్న కాలనీలో నిర్వహించిన మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమానికి హాజరయ్యారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. గరిమెళ్లకొత్తవలసలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అధికారులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మధుబాబు

భగత్‌సింగ్ ఆశయాలు గొప్పవి

నరసన్నపేట: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నరసన్నపేట బీసీ వసతి గృహంలో భగసింగ్ చిత్రపటానికి శనిఆరం ఘన నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ పాత్రను ఏఐవైఎఫ్ కార్యదర్శి నెయ్యిల సాంబశివరాజు తెలియజేశారు. ఏఐవైఎఫ్ నాయకులు చిన్నబాబు, వసంత, కార్తీక్, వినయ్, దినేష్ తదితురులు పాల్గొన్నారు.

పాతపట్నం: విప్లవ ధృవతారగా పేరుపొందిన భగత్‌సింగ్ ఆశయాలు గొప్పవని స్థానిక ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి రిబ్బన్ నూలుపోగులు వేసి నివాళులర్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.రామరాజు మాట్లాడుతూ అతి పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: భగత్‌సింగ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మండలంలోని జలకలింగపురం యువత అన్నారు. గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పాతపట్నం: భగత్‌సింగ్ విగ్రహానికి నూలు పోగు వేస్తున్న ఉపాధ్యాయులు

● ఆర్థికసాయం



హిరమండలం మండలంలోని పిండ్రువాడ గ్రామానికి చెందిన కింజరాపు శంకరరావుకు రెండు కిడ్నీలు పాడవడంతో ప్రస్తుతం డయలసిస్ ద్వారా చికిత్స పొందుతున్నాడు. కిడ్నీ మార్పిడి చేస్తే ఫలితం ఉంటుందని డాక్టర్లు చెప్పారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో కొత్తూరు మండలానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు శనివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. – హిరమండలం

● దిగబడిన వాహనాలు



సరుబుజ్జిలి మండలంలోని అలికాం–బత్తిలి రహదారిలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం ఉదయం రెండు వాహనాలు దిగబడ్డాయి. సుమారు కిలో మీటరు మేర వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. సుమారు 4 నెలలుగా 20 భారీ లారీలు, 10 ఆటోలు, 8 మినీవ్యాన్లతోపాటు, పలు ద్విచక్రవాహనాలు రహదారి గుంతల్లో దిగబడ్డాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

● తిరువీధి



జలుమూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో భాద్రపద మాసం బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం స్వామివారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శ్రీముఖలింగేశ్వరునికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరులను అలంకరించారు. తిరువీధిలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి హారతులు ఇచ్చారు. – జలుమూరు